క్లుప్తంగా

ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరం



ఆంగ్ల భాష నేర్చుకుంటున్న చిన్నారులు

మల్కాపురం: ఆంగ్ల భాషా పరిజ్ఞానం వల్ల మరిన్ని విషయాలను తెలుసుకోగలమని మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం గ్రంథాలయం ఆవరణలో చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతి నిర్వహించారు. ఇంగ్లిష్ నేర్చుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సులభమైన పద్ధతిలో ఇంగ్లిష్ ఎలా నేర్చుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఇంగ్లిష్ టీచర్ శేషు తదితరులు పాల్గొన్నారు.

కుల గణన ప్రకటన కాంగ్రెస్ విజయమే..

గోపాలపట్నం: కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన కాంగ్రెస్ విజయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సోడదాసి సుధాకర్ అన్నారు. కులగణన, జనగణన చేయాలని రాహుల్ గాంధీతో పాటు పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, పార్టీలు కోరుతున్నాయన్నారు. 11ఏళ్ల పాటు పలు రకాల కారణాలు చెప్పి బీజేపీ దాటవేస్తోందని విమర్శించారు. కులగణన బిల్లును పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు సత్కారం



కార్మికులను సత్కరిస్తున్న దాడి నూకరాజు

గోపాలపట్నం: ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 88వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దాడి నూక రాజు నరవలో కార్మికులను ఘనంగా సత్కరించారు. గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రమనే నమ్ముకుని బతికే శ్రామికుల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. అందుకే పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్ పాలన సాగించారన్నారు. సుమారు 25 మంది కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో మళ్ల సత్యారావు, బంటు అప్పలరాజు, దాడి అప్పారావు, మళ్ల రాంబాబు, మళ్ల కళ, ఉల్లారి శివ తదితరులు పాల్గొన్నారు.


బీసీ కులగణన చేపట్టాలి



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న భీమరశెట్టి విశ్వనాథం

అల్లిపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణన చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయన గురువారం ఉదయం జిల్లా కోర్టు జంక్షన్‌లో గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సవరాల రమేష్, బీఎస్పీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

నిత్యం నరకం!



గోకుల్‌నగర్‌లో శిథిలావస్థలో డ్రైన్లు-కాలువలు



తోటవీధిలో చెత్తాచెదారం



దుర్గానగర్‌లో చిన్నపాటి వర్షానికే రోడ్డుపై చేరిన చెత్తాచెదారం

- శిథిలావస్థలో డ్రైన్లు
- బురదమయంగా రహదారులు
- పేరుకుపోతున్న చెత్తాచెదారాలు
- పారిశుధ్య నిర్వహణ అధ్వానం
- అవస్థలు పడుతున్న ప్రజలు



సుభాష్‌నగర్ రైల్వే వంతెన రహదారిపై నిత్యం మురుగు ప్రవాహం ఇలా...

కంచరపాలెం: జీవీఎంసీ 56,57 వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ పరిధిలోని సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, గౌరీనగర్, దుర్గానగర్, తోట వీధి, గోకుల్‌నగర్, గొల్లకంచరపాలెం తదితర ప్రాంతాల్లో కాలువలు, డ్రైనేజీలు శిథిలమయ్యాయి. మురుగు రోడ్లపై పారడంతో అధ్వానంగా మారుతున్నాయి. ఇక చిన్నపాటి వర్షం కురిసినా ఆ ప్రాంతాల ప్రజలకు తిప్పలే. జోన్-5 ఇంజినీరింగ్, పబ్లిక్‌హెల్త్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని ప్రజలు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

గొల్ల కంచరపాలెం తోటవీధి ప్రాంతంలో ఇటీవల డ్రైనేజీ కమ్ వంతెన నిర్మించారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఉన్న సమస్య తీరకపోగా.. అంతకంటే మరింత జఠిలంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొల్లకంచరపాలెం నుంచి దుర్గానగర్‌కు వెళ్లే రైల్వేట్రాక్ రహదారి ప్రధాన గెడ్డను తలపిస్తోంది. రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి రోడ్లు, కాలువలు పొంగి రహదారులపై చెత్తాచెదారాలు, మురుగు చేరి అడుగుతీసి వేయలేని పరిస్థితి తలెత్తింది.

57వ వార్డులో..

57వ వార్డులో అధ్వాన పరిస్థితులు ఉన్నాయి. వార్డు విస్తీర్ణం ఊర్వశికూడలి నుంచి ఎన్ఏడీ సాకేతపురం వరకు ఉండడంతో పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదు. సుభాష్‌నగర్‌లో కాలువలు, డ్రైనేజీలు శుభ్రం చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అదే ప్రాంతంలో కాలువలు పొంగి మంచినీటి బోరులోకి మురుగు చేరి మంచినీరు పూర్తిగా కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద, మురుగు రహదారులపై పేరుకుపోవడంతో రాకపోకలు సాగించకలేక పోతున్నారు. రోజుల తరబడి మురుగు, చెత్త వదిలేయడంతో దోమలు విజృంభిస్తున్నాయి. విషజ్వరాల బారిన పడుతున్నామని వాపోతున్నారు.

ఇన్‌చార్జే దిక్కు

56వ వార్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో 55వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్తీక్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన తన వార్డును చూసుకుంటూ అదనపు బాధ్యతలు చూడడం సాధ్యం కావడం లేదు. దీంతో పారిశుధ్య సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదనే చెప్పాలి. ఫలితంగా వార్డులో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది.



సుభాష్‌నగర్‌లో మంచినీటి బోరులోకి ప్రవేశిస్తున్న మురుగునీరు

ముక్కు మూసుకోవాల్సిందే..

చిన్నపాటి వర్షాలకే రహదారులపై చెత్తాచెదారాలు, మురుగు ప్రవహిస్తుంది. శిథిలావస్థకు చేరిన కాలువలు, డ్రైనేజీలకు మరమ్మతులు చేపడితే ఇలాంటి సమస్యలు రాకుండా ఉంటాయి. నిత్యం రోడ్లు దుర్గంధభరితంగా ఉండడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. బయటకు వస్తే ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి తిన్నది కూడా ఒంటబట్టడడం లేదు.

– ఆర్.నానాజీ, తుమ్మడపాలెం, ఊర్వశికూడలి.

అధికారులు స్పందించాలి

సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. మురుగు రహదారులపై ప్రవహిస్తుంది. దుర్గానగర్‌లో వంతెన నిర్మించినా ప్రణాళిక లోపం వల్ల కార్మికులకు, పాదచారులు, వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. వంతెన నిర్మించి ఏం ప్రయోజనం అన్నట్టుగా మారింది. ఉన్నతాధికారులు పర్యవేక్షించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

–ఎస్.సత్యనారాయణ, దుర్గానగర్, కంచరపాలెం.

మే డే స్ఫూర్తితో ముందుకు...

- ఘనంగా కార్మిక దినోత్సవం
- రెపరెపలాడిన అరుణపతాకం
- పెద్ద ఎత్తున పాల్గొన్న కార్మికులు



ఎన్ఏడీ గేటు వద్ద ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న మారయ్య



వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మళ్ల విజయప్రసాద్

గోపాలపట్నం: కార్మిక దినోత్సవాన్ని పలు కార్మిక సంఘాలు వాడవాడలా ఘనంగా జరుపుకున్నాయి. గోపాలపట్నం జోన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నూకమాంబ ఆలయం వద్ద నుంచి పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. గోపాపట్నం జోన్ ప్రధాన కార్యదర్శి పి. అనసూయ, జోన్ ఉపాధ్యక్షుడు బలివాడ వెంకటరావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ జిల్లా కార్యదర్శి రాజు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద..

నేవల్ ఆర్మమెంట్ డిపో గేటు వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ జెండాను యూనియన్ ప్రధాన కార్యదర్శి జేసీఎం థర్డ్ లెవల్ మెంబర్ సాలాపు మారయ్య ఆవిష్కరించారు. కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో..

జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఎర్ర జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, రాజు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో..

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాము, 40వ వార్డు ఇన్‌చార్జి ఆర్‌ఆర్ రాజు, వార్డు అధ్యక్షుడు గేదెల రమణ, రామారావు, సీఐటీయూ నాయకులు ప్రసాద్, బి.ఎ స్.ఎన్.రాజు, కర్రి ఆదిబాబు, చైతన్య, జగదీష్, నూకరాజు, వెదురు శ్రీను, చిన్నాజీ, కూర్మారావు, అరుణ్, ఆచారి, మల్లేష్, మూర్తి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: కార్మికులకు మేడే పండగ రోజు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త డాక్టర్ మళ్ల విజయప్రసాద్ అన్నారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యలయం వద్ద మే డే వేడుకలు నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న మళ్ల విజయప్రసాద్ పార్టీ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు అందించారు. పలు వార్డుల కార్పొరేటర్లు డాక్టర్ పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, గులిగిందల కృష్ణ, మీసాల పెంటారావు, సంపత్, పూండి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం శానిటరీ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు యూనియన్ జెండా ఎగురవేశారు. యూనియన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, జనార్దన్, పైడిరాజు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు. కోరమాండల్ గేటు ఎదురుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో యూనియన్ జిల్లా నాయకుడు జి.వి.సత్యనారాయణమూర్తి (నానీ) యూనియన్ జెండా ఎగురవేశారు. యూనియన్ నాయకులు గుండల రాంబాబు, నూనెల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో జెండా ఆవిష్కరిస్తున్న జియ్యాని శ్రీధర్



మల్కాపురం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు



గోపాలపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



గుల్లలపాలెం వద్ద పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకుడు జగ్గునాయుడు



కోరమాండల్ వద్ద మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు సత్యనారాయణమూర్తి

పేపర్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు శిక్షణ



పేపర్ క్రాఫ్ట్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: స్థానిక మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ వై.పద్మజ పర్యవేక్షణలో ముందుగా విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఎం.శిరీష పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి రోజూ కనీసం గంట సేపు పుస్తకాలు చదవాలని ఆమె సూచించారు. నీతి కథలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం విద్యార్థులు పేపర్ కటింగ్ ద్వారా వివిధ రకాల వస్తువులు తయారు చేశారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు కూటమి ద్రోహం

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు టీడీపీ, జనసేన, బీజేపీ ద్రోహం చేస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ఆరోపించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పాతగాజువాకలో నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్‌లో మూడు వేల మంది కార్మికులను తొలగిస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఈనెల 20న నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా ఇక్కడ కూడా సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రానికి అన్యాయం: చంద్రబాబు, నితీష్ కుమార్ మద్దతుతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. అయినా రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చంద్రబాబు దృష్టిసారించడం లేదని ఆరోపించారు. కార్మికుల ఐక్య పోరాటాల కారణంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకోగలుగుతున్నామన్నారు. నాయకులు ఎం.జగ్గునాయుడు, ఎం.రాంబాబు, కె.కిరీటం పాల్గొన్నారు.

నేటి నుంచి కిశోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అల్లిపురం: అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు సీడీపీవో ఎంవీ రమణకుమారి తెలిపారు. గురువారం అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణకు సంబంధించిన అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. శిక్షణలో భాగంగా కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, బాలికల హక్కులు, చట్టాల గురించి వివరించాలని సూచించారు. బాల్య వివాహాల కట్టడి, బాలికల అక్రమ రవాణా నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి తెలిపారు. ఈ సందర్భంగా కిశోర బాలికల శిక్షణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ బి.మమత, కె.శకుంతల, ఐ.సులేఖ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ తల్లి పండగ

పెందుర్తి: రాంపురం ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మతల్లి వార్షిక పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి, ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వందలాది మంది భక్తులు అగ్ని గుండాలు తొక్కారు. పసుపు కుంకుమలు, చీరలు, ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. పలువురు నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భారీఎత్తున మజ్జిగ వితరణ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాణసంచా కాల్పులు అబ్బురపరిచాయి. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష దంపతులు, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

కనులపండువగా దుర్గమాంబ పండగ

పరవాడ: పెదముషిడివాడ శివారు గండివానిపాలెం గ్రామంలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారి పండగను గ్రామస్తులు గురువారం కనులపండువగా జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ అమ్మవారి చల్లని చూపు ఈ ప్రాంత ప్రజలపై ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు నందవరపు శ్రీను, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో అమర్‌నాథ్, అదీప్‌రాజ్

సింహాచలం డిపో ఇన్‌చార్జి డీఎంగా శరత్‌బాబు



శరత్‌బాబును అభినందిస్తున్న ఉద్యోగులు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ డిపో ఇన్‌చార్జి డీఎంగా ఎస్.శరత్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు డిపో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజశేఖర్‌కు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా (జోన్-1) పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంగా బాధ్యతలు స్వీకరించిన శరత్‌బాబును రాజశేఖర్, ఉద్యోగులు అభినందించారు.

స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 'కొమ్ము'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోక్‌ఓవెన్స్ విభాగం జనరల్ ఫోర్‌మెన్ కొమ్ము ప్రసాదరావు నియమితులయ్యారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం యూనియన్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ కొమ్ము నియామకాన్ని ప్రకటించారు.